క్లుప్తంగా


పరామర్శ



మంగరాజును పరామర్శిస్తున్న కిరణ్‌కుమార్ తదితరులు

రణస్థలం: మండలంలోని పాతసుందరపాలెం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు బస్వ అసిరిరెడ్డి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. అలాగే అదే గ్రామానికి చెందిన వెలుగు వీవోఏ కోరెడ్ల జయలక్ష్మి కాలికి శస్త్ర చికిత్స జరగడంతో వీరిని ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ గురువారం పరామర్శించారు. అలాగే కోటపాలెం గ్రామానికి చెందిన ఎర్రబోలు మంగరాజు అమ్మ ఇటీవల మరణించడంతో ఆ కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయనతో పాటు మండల పార్టీ అధ్యక్షుడు గొర్లె శ్రీనివాసరావు, ఎచ్చెర్ల నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు మజ్జి రమేష్, మండల ఎగ్జిక్యూటివ్ మెంబర్ మహంతి అప్పలనాయుడు, ఎంపీటీసీ సుంకర కిషోర్ కుమార్, ఉప సర్పంచ్ దన్నాన సీతారాం, నాయకులు చుక్క వెంకటరమణ, బస్వ రాము, చుక్క లక్ష్మణరెడ్డి, ఎర్రబోలు నాగరాజు తదితరులు ఉన్నారు.

ముంజూరు పుస్తకావిష్కరణ నేడు



శ్రీకాకుళం కల్చరల్: కళింగాంధ్ర ప్రాంత కవులందరి వివరాలతో కూర్చిన 'ముంజూరు' పుస్తకావిష్కరణ మందస మండలంలోని హరిపురంలో శుక్రవారం జరుగుతుందని సిక్కోలు బుక్స్ వ్యవస్థాపకుడు దుప్పల రవికుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, పార్వతీపురం మన్యం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు పేర్లతో ఆరు జిల్లాల ప్రాంతంగా ఉన్న కళింగాంధ్ర ప్రాంతంలోని కవులందరినీ ఒక చోటకు చేర్చి ఒక డైరెక్టరీని తీసుకువద్దామనే ప్రయత్నంలో ఈ పుస్తకం రూపుదిద్దుకుందన్నారు. దీనిలో 72 మంది కవులు రాసిన 130 కవితలు, అనుబంధంగా ఉన్న డైరక్టరీలో 260 మందికి పైగా కళింగాంధ్రా కవుల వివరాలు పొందుపరిచామన్నారు. ఈ ప్రచురణ ఈ ప్రాంత అస్తిత్వ ఉద్యమానికి కీలకం కాగలదని ఆశాభావం వ్యక్తం చేశారు.

విద్యార్థులకు వ్యాస రచన పోటీలు



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

శ్రీకాకుళం కల్చరల్: నగరానికి సమీపంలో పొన్నాడ బ్రిడ్జి ఒడ్డున ఉన్న ఇస్కాన్ జగన్నాథ మందిరం ఆధ్వర్యంలో 80 అడుగుల రోడ్డులో ఉన్న ఆనందమయి కన్వెన్షన్ హాలులో వ్యాస రచన పోటీలు గురువారం జరిగాయి. మనకు ఏ జీవనం అవసరం, ఏ విషయాలు ప్రకృతిలో కృష్ణుడిని గుర్తు చేస్తాయనే అనే అంశాలపై పోటీ జరిగింది. దీనిలో వివిధ స్కూల్స్ నుంచి 100 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇస్కాన్ నిర్వాహకుడు లక్ష్మీపతిదాస్ మాట్లాడుతూ గెలుపొందిన విద్యార్థులకు ఆగస్టు 17న జరిగే కృష్ణాష్టమి వేడుకల సమయంలో బహుమతుల ప్రధానం జరుగుతుందని పేర్కొన్నారు. న్యాయ నిర్ణేతలుగా ప్రభుత్వ పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు వ్యవహరించారు.

దక్షిణామూర్తికి అష్టోత్తర పుస్తకార్చన



పుస్తకార్చన నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక గుజరాతీపేటలో లక్ష్మేశ్వర స్వామి దేవాలయంలో ఉన్న దక్షిణామూర్తి సన్నిధిలో అష్టోత్తర పుస్తకార్చన గురువారం జరిగింది. కాశీని వేంకటేశ్వరరావు, రమణమ్మ దంపతులు తమ స్వీయ రచనగా 'నమో శ్రీదక్షిణామూర్తి' అనే 108 పుస్తకాలను విశ్వజయం గ్రూపు సభ్యుల శ్రేయస్సు కోసం స్వామికి సమర్పించారు. ఈ పుస్తకంలో స్వామివారి పురాణ ప్రసిద్ధ ప్రదేశాల్లోని సుప్రసిద్ధమైన ఆలయాల విశేషాలు, స్వామివారి చరిత్ర, స్తోత్రాలను పొందుపరిచినట్లు వేంకటేశ్వరరావు తెలిపారు. ఈ పుస్తకాలను ఆలయ అర్చకులు పెంట రామచంద్రశేఖరశర్మ చేతులమీదుగా భక్తులకు అందజేయాలని కోరారు. కార్యక్రమంలో మీసాల వెంకటరమణ, గురుగుబెల్లి ప్రశాంత్, వనజాక్షి, ప్రసన్నగాయత్రి పాల్గొన్నారు.

అయ్యో.. అన్నదాత..!



- పెట్టుబడి సాయం లేక అప్పులు
- గ్రామాల్లో సేవలందక తిప్పలు
- నిలిచిపోయిన రైతు సేవా కేంద్రాల నిర్మాణాలు

పనుల ప్రారంభంలోనే ఆగిపోయిన జేఆర్‌పురం-1 రైతుసేవా కేంద్రం



జి.సిగడాం మండలంలోని వెలగాడ రైతు సేవా కేంద్రం

రణస్థలం: రాష్ట్రంలో వ్యవసాయాన్ని పండగ చేయాలనే దృక్పథంలో గత ప్రభుత్వంలో మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఎన్నో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారు. దీనిలో భాగంగా రైతు నివసిస్తున్న ఊరులోనే సేవలన్నీ అందేలా రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశారు. తద్వారా రైతుకు ఎటువంటి అవసరం ఉన్నా ఆర్‌బీకే(ప్రస్తుతం రైతు సేవా కేంద్రం)కు వెళ్తే క్షణాల్లో పని జరిగేది. కానీ ప్రస్తుత కూటమి పాలనలో గ్రామాల్లోని రైతులకు అవస్థలు తప్పడం లేదు. గ్రామంలో ఎటువంటి సేవలు అందకపోవడంతో మండల కేంద్రాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన పరిస్థితి కనిపిస్తోంది.

రైతు భరోసా కేంద్రాలు నిర్వీర్యం

రైతులకు ఎన్నో సేవలందించిన రైతు భరోసా కేంద్రాలను కూటమి ప్రభుత్వం వచ్చాక నిర్వీర్యం చేయడం ప్రారంభించింది. ఆర్‌బీకేలను రైతు సేవా కేంద్రాలుగా పేరు మార్చినా అక్కడ రైతుకు ఎటువంటి సేవలందడం లేదు. గత ప్రభుత్వంలో ఆర్‌బీకేల్లో నిరంతరం వ్యవసాయ సహాయకులు ప్రభుత్వం ప్రకటించే పథకాలపై సూచనలు, సలహాలు అందించేవారు. పొలం బాట పట్టి రైతులకు కాలానుగుణంగా పంటల యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించేవారు. అయితే ప్రస్తుతం ఆ పరిస్థితి ఎక్కడా కనిపించడం లేదు. ఎచ్చెర్ల నియోజకవర్గంలోని మొత్తం 99 రైతు సేవా కేంద్రాల్లో 45కు పైగా రైతు భరోసా కేంద్రాల నిర్మాణ పనులు ఎక్కడక్కడే నిలిచిపోయాయి.

పెట్టుబడి సాయమేదీ..?

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో క్యాలెండర్‌లో రైతు భరోసా అందించే తేదీలను ప్రకటించి రైతు భరోసాను తూచా తప్పకుండా పెట్టుబడి సాయంగా రైతన్న బ్యాంక్ ఖాతాలో జమ చేసేవారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎచ్చెర్ల నియోజకవర్గంలోని సుమారు 40 వేల మంది రైతులకు అన్నదాత సుఖీభవ పథకంలో భాగంగా డబ్బులును ఒక్కసారి కూడా వేయలేదు. గత ప్రభుత్వంలో రైతులకు ఏడాదికి రూ.18,500లు అందేది. కూటమి ప్రభుత్వంలో రూ.20 వేలు ఇస్తామని చెప్పడం తప్ప ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా అన్నదాతకు అందించలేదు. దీంతో రైతులు పంటల పెట్టుబడి కోసం అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. అలాగే గ్రామాల్లో సక్రమంగా సేవలు అందకపోవడంతో మండల కేంద్రాల్లో బారులుతీరుతున్నారు.

పేరు మార్చి గాలికొదిలేశారు



కూటమి ప్రభుత్వం వచ్చాక రైతు భరోసా కేంద్రాలు నిర్వీర్యమయ్యాయి. రైతు సేవా కేంద్రాలుగా పేరు మార్చి సేవలు పూర్తిగా గాలికొదిలేశారు. రైతులకు విత్తనాలు, ఎరువులు అందడం లేదు. పంటకు మద్దతు ధర కూడా ఇవ్వడం లేదు. ఎరువుల అమ్మకాల్లో ఎన్నో అక్రమాలు జరుగుతున్నాయి.

– రాయపురెడ్డి భుజంగరావు, వైస్ ఎంపీపీ, రణస్థలం

సాయం అందలేదు



కూటమి ప్రభుత్వం అధికారంలోని వచ్చి ఏడాది దాటుతోంది. కానీ ఇప్పటి వరకు ఒక్కసారి కూడా అన్నదాత సుఖీభవ పథకం అందించలేదు. దీంతో రైతులు పంటకు పెట్టుబడి సాయం లేక అప్పులు పాలవుతున్నారు. ఖరీఫ్ ప్రారంభమైనా రైతన్న కష్టాలు ప్రభుత్వానికి కనిపించకపోవడం దారుణం.

– మీసాల రామారావు, సర్పంచ్, దేరసాం

మోసాలతోనే ఏడాది పాలన



ఎచ్చెర్ల: చిగురుకొత్తపల్లిలో అవగాహన కల్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

- పలు గ్రామాల్లో 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ'

రణస్థలం: కూటమి ప్రభుత్వం ఏడాది పాలనంతా మోసాలతోనే సాగిందని రణస్థలం వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు గొర్లె శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని వీఎన్‌పురం పంచాయతీ రెడ్డిపేట గ్రామంలో బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఎలా సంక్షేమ పథకాలు అందాయో.. కూటమి పాలనలో ఎలా అందుతున్నాయో వివరించారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయకుండా రోజుకోమాటతో తాత్సారం చేస్తోందని దుయ్యబట్టారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమాన్ని విస్మరించి రెడ్‌బుక్ రాజ్యాంగంతో ప్రశ్నించేవారిపై కేసులు పెడుతున్నారని మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఉండుంటే ఈపాటికే ఎన్నో పథకాలు వచ్చేవని తెలియజేశారు. అనంతరం ప్రజల సెల్‌ఫోన్ల నుంచి క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేయించి చంద్రబాబు మోసాలను వీడియో రూపంలో వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర యువజన విభాగం సంయుక్త కార్యదర్శి పిన్నింటి సత్యంనాయుడు, బీసీ సెల్ అధ్యక్షుడు మజ్జి రమేష్, యువజన విభాగం అధ్యక్షుడు దన్నాన హరి, మాజీ సర్పంచ్ మింది జనార్థన రెడ్డి, మండల ఎగ్జిక్యూటివ్ మెంబర్ మహంతి అప్పలనాయుడు, నాయకులు రెడ్డి అప్పలనాయుడు, లెంక సీతంనాయుడు, బాసి రమణ, జగ్గురోతు రాజారావు, దుంప అక్కులరెడ్డి, జగ్గరోతు సిమ్మి నాయుడు, రెడ్డి వాసు తదితరులు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల: రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు మాటలను ప్రజల నమ్మవద్దని వైఎస్సార్‌సీపీ లావేరు మండల పార్టీ అధ్యక్షుడు దన్నాన రాజీనాయుడు కోరారు. లావేరు మండలంలోని చిగురుకొత్తపల్లి, గురుగుబిల్లి, లావేరు, అప్పాపురం, వెంకటాపురం తదితర గ్రామాల్లో బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. గ్రామంలోని ప్రజలకు కూటమి ప్రభుత్వం హామీలు అమలు చేయకుండా చేస్తున్న మోసాన్ని వివరించారు. కూటమి నాయకులను హామీలపై నిలదీయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మీసాల సీతంనాయుడు, రొక్కం బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



రణస్థలం: చంద్రబాబు మోసాలు ఇంటింటికీ వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

లింగ నిర్ధారణ నేరం



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో సాయిప్రత్యూష

శ్రీకాకుళం పాతబస్టాండ్: లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరమని, నిబంధనలు అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని శ్రీకాకుళం ఆర్డీవో సాయిప్రత్యూష హెచ్చరించారు. గురువారం ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన సబ్ డిస్ట్రిక్ లెవెల్ అప్రోప్రియేట్ అథారిటీ, కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ప్రసూతి ఆస్పత్రులు, స్కానింగ్ సెంటర్లు లింగ నిర్ధారణ నిబంధనలను కచ్చితంగా పాటించాలన్నారు. చట్టాన్ని ఉల్లంఘిస్తే కఠిన శిక్ష తప్పదని హెచ్చరించారు. శ్రీకాకుళం సబ్ డివిజన్ పరిధిలో లింగ నిర్ధారణ నేరంపై హోర్డింగులు ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే గ్రామస్థాయిలో ప్రజల్లో అవగాహన కల్పించే సదస్సులు నిర్వహించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో గైనకాలజిస్ట్ పైడి స్వర్ణలత, డిప్యూటీ డీఎంహెచ్‌వో డా.మేరీ కాథరిన్, డిప్యూటీ మాస్మీడియా అధికారి మహంతి వెంకటేశ్వరరావు, సీపీ రమణమూర్తి, అడ్వకేట్ విజయలక్ష్మి, సోషల్ వర్కర్ లిడియా, మంతిన వెంకటస్వామి, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ విజయలక్ష్మి, పి.మోహిని తదితరులు పాల్గొన్నారు.

బయోమెట్రిక్ సమస్య పరిష్కారానికి కృషి



సమీక్షిస్తున్న ఎమ్మెల్యే శంకర్, పక్కనే డీఎంహెచ్‌వో అనిత

అరసవల్లి: సచివాలయాల్లో పనిచేస్తున్న ఏఎన్‌ఎంలంతా ఆయా సచివాలయాల్లో బయోమెట్రిక్ వేసి విధులకు వెళ్లడంపై పలు ఇబ్బందులున్న దృష్ట్యా దీనిపై అధ్యయనం చేసి ప్రభుత్వానికి నివేదిస్తామని ఎమ్మెల్యే శంకర్ అన్నారు. ఈ మేరకు గురువారం జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో నియోజకవర్గ ఆస్పత్రుల మెడికల్ ఆఫీసర్లు, సంబంధిత ప్రాజెక్టు అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో చాలాచోట్ల పీహెచ్‌సీల్లో సిబ్బంది కొరత ఉందని, వెంటనే నియామకాలు జరిగేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. అలాగే మందుల సరఫరా ఇతరత్రా అంశాలపై సమీక్షించారు. జిల్లా అధికారుల నుంచి పలు మెడికల్ ఆఫీసర్ల పనితీరుపై నివేదికలు కోరారు. కార్యక్రమంలో జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ అనిత తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

ఎచ్చెర్ల: మండలంలోని పొన్నాడ ఫీడర్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఎలక్ట్రికల్ ఈఈ యోగీశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎచ్చెర్ల మండలంలోని పొన్నాడ ఫీడర్ పరిధిలో ఆర్‌డీఎస్‌ఎస్ పనులు, కొత్త లైన్ల నిర్మాణాలను చేపట్టనున్నామని, అందువలన కొత్తపేట, వెంకన్నగారిపేట, తెప్పరేవు, సెగిడిపేట, లింగలపేట, ఆనమిత్ర టౌన్‌షిప్, మాలముద్దాడ ఫీడర్ పరిధిలోని గ్రామాలకు విద్యుత్ నిలిపివేయడం జరుగుతుందని అన్నారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్‌కు అంతరాయం ఉంటుందన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

జి.సిగడాం: మండలంలోని చెట్టుపొదిలాం 11 కేవీ ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా ఆ పరిధిలోని గ్రామాలకు శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ నిలుపుదల చేస్తున్నామని ఏఈఈ పైడి దుర్గాప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. చెట్టుపొదిలాం, గొబ్బూరు, నిద్దాంచ, అద్వాన్నంపేట, చంద్రయ్యపేట, మధుపాం, వెలగాడ, దేవరవలస, ఎస్పీఆర్‌పురం గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు.

విద్యార్థినికి ఆర్థిక సాయం



విద్యార్థినికి ఆర్థిక సాయం అందజేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): అన్ని దానాల్లోకి ఉత్తమమైన దానం విద్యాదానమని హర్షవల్లి లయన్స్ క్లబ్ శ్రీకాకుళం వ్యవస్థాపకుడు లయన్ హరికాప్రసాద్ అన్నారు. స్థానిక ఆర్ట్స్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న జోషిత ప్రియకు చదువు నిమిత్తం రూ.10 వేల నగదుతో పాటు, పుస్తకాలు, అవసరమైన సామాగ్రిని లయన్స్ క్లబ్ శ్రీకాకుళం హర్షవల్లి కార్యాలయంలో గురువారం అందజేశారు. జోషిత ప్రియ బాగా చదువుతుందని, పేద విద్యార్థిని కావడంతో ప్రోత్సాహం అందించామని తెలియజేశారు. కార్యక్రమంలో ఆర్సీ లయన్ డా.కృష్ణ మోహన్, పూర్వపు జోన్ చైర్మన్ లయన్ శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నీలమ్మ తల్లి ఆవేటి వారాలు



ప్రత్యేక అలంకరణలో నీలమ్మ తల్లి

శ్రీకాకుళం కల్చరల్: ఆషాడ మాసం పురస్కరించుకొని పట్టణంలోని పెద్దబరాటం వీధి, గైనేటి వీధిలో వెలసిన నీలమ్మ తల్లి అమ్మవారి ఆవేటి వారాలు గురువారం ఘనంగా జరిగాయి. ఆలయ అర్చకులు పెంట కిరణ్‌శర్మ నేతృత్వంలో అమ్మవారికి ఉదయం క్షీరాభిషేకం నిర్వహించారు. అలాగే భక్తులు ఆవేటి వారాలు చేసి చల్లదనోత్సవం నిర్వహించారు. పిదప అమ్మవారిని పూలతో అలంకరణ చేశారు. తదుపరి కుంకుమ పూజలు జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారికి ముడ్రాటలు సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బరాటం సాయిరాజ్, పొన్నాడ రుషి, త్రిపురాన వరప్రసాద్, ఎ.వెంకటరమణ, పట్నాల రామశంకరరావు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పూజలు



పూజలందుకుంటున్న షిరిడీ సాయిబాబా

జి.సిగడాం: మండలంలో ఆనందపురం గ్రామంలోని షిరిడీ సాయిబాబా ఆలయం ఆవరణంలో గురువారం అంగరంగ వైభవంగా పూజలు నిర్వహించారు. అనంతరం భారీ నారాయణసేవ చేపట్టారు. అలాగే పెంట, జాడ, దేవరవలస, గెడ్డకంచరాం, ఎందువ, చంద్రయ్యపేట గ్రామాల్లోని ఆలయాల్లోనూ ప్రత్యేక వ్రతాలు చేపట్టారు. కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఏదీ భరోసా..?

- ఆశా కార్యకర్తలపై ప్రభుత్వం శీతకన్ను
- చాలీచాలని గౌరవ భృతితో యాతన



టీడీవలసలో జ్వరాలతో బాధపడుతున్న రోగులకు సేవలపై ఆరా తీస్తున్న అధికారులు

జి.సిగడాం: గ్రామస్థాయిలో ప్రజలకు ఎటువంటి అనారోగ్య సమస్యలు వచ్చినా ముందుగా గుర్తించే వారు ఆశ కార్యకర్తలు. వీరు గ్రామాల్లో ఉంటూనే ప్రభుత్వానికి అనేక సేవలు అందిస్తుంటారు. అయితే గ్రామాల్లో వైద్య సేవలు సక్రమంగా అందేందుకు ఎంతో కృషి చేస్తున్న ఆశ కార్యకర్తలపై ప్రభుత్వం శీతకన్ను వహిస్తోంది. ఎన్నికల ముందు కూటమి నాయకులు ఆశా కార్యకర్తలకు అనేక హామీలు ఇచ్చారు. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత పట్టించుకోవడం లేదు. ఎక్కువ పని చేస్తూ.. తక్కువ జీతాలతో నానా ఇబ్బందులు పడుతున్నామని ఆశా కార్యకర్తలంతా ఇటీవల నిరసనలు తెలిపారు. అధికారులు స్పందించి వేతనాలను పెంచేలా చర్యలు తీసుకోవాలని కోరారు. మరోపక్క గ్రామస్థాయిలో నాయకుల వేధింపులు కూడా ఎక్కువవుతున్నాయని ఆవేదన చెందుతున్నారు.



గ్రామాల్లో వైద్య సేవలను అందిస్తున్న దృశ్యం

ఏళ్లుగా పనిచేస్తున్నా ఫలితం లేదు



ఆశా కార్యకర్తల వ్యవస్థ ఏర్పడినప్పటి నుంచి మేము గ్రామాల్లో రోగుల వద్దకు వెళ్లి వారికి వైద్య సేవలను అందిస్తున్నాం. ఎన్నోఏళ్లు నుంచి సేవలు అందించినా మాకు ఎటువంటి ఫలితం లేదు. ప్రభుత్వం స్పందించి మాకు మేలు జరిగేలా చర్యలు తీసుకోవాలి.

– బగాది లక్ష్మి, దవళపేట, జి.సిగడాం

హామీలు అమలు చేయాలి



ప్రభుత్వం ఆశా కార్యకర్తలకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేసి ఆదుకోవాలి. గ్రామస్థాయిలో రోగాలు వస్తే వెట్టి చాకరీ చేసేది ఆశాలే. అటువంటి మాకు ఎటువంటి గుర్తింపు లేదు.

– ముద్దాద రమణమ్మ, ఆశా కార్యకర్త, జి.సిగడాం

వేతనాలు తక్కువ



గ్రామాల్లో ఎవరికి ఆరోగ్యం బాగులేకపోయినా ముందు ఉండేది ఆశా కార్యకర్తలమే. కానీ మాకు మాత్రం వేతనాలు తక్కువ ఇస్తుండడంతో కుటుంబ పోషణ కష్టంగా మారింది.

– పొగిరి రమాదేవి, పెంట, జి.సిగడాం

• గజానికో గుంత..!



జి.సిగడాం మండల పరిధిలోని పొగిరి నుంచి జి.సిగడాం వరకు రహదారిపై ప్రయాణం చేయాలంటే నరకయాతన తప్పదు. రహదారిపై గజానికొక గుంత ఉండడంతో వర్షం పడితే నీరు నిల్వ అవుతోంది. దీంతో ఆ సమయంలో ప్రయాణం చేసేవారు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ రోడ్డుపై కనీసం నడిచి వెళ్లేందుకు కూడా ఇబ్బందులు తప్పడం లేదు. అందువలన అధికారులు స్పందించి రహదారి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. – జి.సిగడాం

బాలియాత్రను విజయవంతం చేయండి

శ్రీకాకుళం అర్బన్: శ్రీముఖలింగంలో నవంబర్ 9వ తేదీన జరగనున్న బాలియాత్రను విజయవంతం చేయాలని శ్రీముఖలింగం ఆలయ అనువంశిక అర్చకులు నాయుడుగారి రాజశేఖర్ పిలుపునిచ్చారు. శ్రీకాకుళంలోని ఎన్‌జీవో కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బాలియాత్ర అనేది ఇండియాలోనే అతి ప్రాచీనమైన యాత్ర అని అన్నారు. ఈ యాత్ర కార్తీక పౌర్ణమి రోజున ప్రారంభమవుతుందని, ఈ యాత్ర మరుగున పడినప్పటికీ ఒడిశా రాష్ట్రంలోని కటక్‌లో 1992 నుంచి మరలా ప్రారంభించబడిందన్నారు. శ్రీముఖలింగంలో ఈ యాత్ర గతేడాది నుంచి నిర్వహించడం జరుగుతోందన్నారు. ఈ ఏడాది కూడా నిర్వహించనున్న ఈ యాత్రను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

విస్తృత స్థాయి సమావేశం నేడు

ఎచ్చెర్ల: మండలంలో చిలకపాలేం గ్రామంలోని పొందూరు రహదారిలో ఉన్న జి.కన్వెన్షన్ హాల్‌లో వైఎస్సార్‌సీపీ విస్తృతస్థాయి సమావేశం శుక్రవారం నిర్వహించనున్నట్లు మండల పార్టీ అధ్యక్షుడు బోర సాయిరాం గురువారం తెలిపారు. బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ రీ కాలింగ్ చంద్రబాబు మ్యానిఫెస్టో కార్యక్రమంపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. కార్యక్రమానికి ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరవుతారని వెల్లడించారు. కార్యక్రమానికి కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలి రావాలని కోరారు.